ఎత్తిపోతలతోనే మెట్టకు జీవం

- రైతుల విన్నపాన్ని పట్టించుకోని గత ప్రభుత్వం
- కలగానే మిగిలిన సోమలవాగుపై ఎత్తిపోతల ఏర్పాటు
- అన్నదాతకు తప్పని ఎదురు చూపులు


కైప చెరువు అలుగు ద్వారా వృథాగా పోతున్న నీరు

బనగానపల్లె: గత ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేసిందనేందుకు మరో ప్రత్యక్ష సాక్ష్యం సోమలవాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు సమస్య. బనగానపల్లె – పండ్లాపురం గ్రామాల మధ్య ఉన్న సోమలవాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని మండలంలోని పండ్లాపురం, నందవరం, కైప సంకలాపురం గ్రామాలకు చెందిన రైతులు ఏళ్లతరబడి విన్నవిస్తూనే ఉన్నారు. ఎస్సార్బీసీ సమీపానున్నా సాగునీటి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు ఈ గ్రామాల రైతులకు. సుమారు 500 ఎకరాలు ఎత్తు ప్రాంతంలో ఉన్నందున ఎస్ఆర్బీసీ ద్వారా సాగునీరు లభించక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తమ సమస్యలను గతంలో అధికారులకు, అప్పటి టీడీపీ నాయకులకు విన్నవించినా స్పందన లేదు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామంటూ కాలం వెళ్లదీయడం తప్పా సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని, మెట్ట భూములకు జీవం పోయాలని ఆయా గ్రామాల రైతులు విన్నవిస్తున్నారు.

వృథా అవుతున్న సాగునీరు

ఎస్ఆర్బీసీ ప్రధాన కాల్వ నుంచి 9వ బ్లాక్ పక్కభాగంలో కైప చెరువుకు అవసరమైన సందర్భాల్లో నీటిని విడుదల చేసేందుకు అధికారులు కాల్వ నిర్మాణ సమయంలోనే భారీ క్రస్ట్ గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రస్ట్‌గేట్ ద్వారా విడుదల చేసే నీరు కింది భాగంలోని సోమలవాగు మీదుగా కైప చెరువుకు చెరుతుంది. అయితే క్రస్ట్ గేట్ కింది భాగం తుప్పు పట్టి నిరంతరం నీరు లీకేజీ అవుతూనే ఉంది. కైప చెరువు భారీ అలుగు నుంచి కోవెలకుంట్ల సమీపంలోని కుందూనదిలో వృథాగా కలుస్తుంది. సుమారు 50క్యూసెక్యుల మేర నీరు వృథా అవుతుందని సాక్షాత్తూ ఎస్ఆర్బీసీ అధికారులే చెబుతున్నారు. సోమలవాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే ఈ వృథా నీరు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి



సోములవాగు ద్వారా ఎస్ఆర్బీసీ ప్రధాన కాల్వ నుంచి నిరంతర నీటి ప్రవాహం ఉన్నందున వాగుకు అనుసంధానంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి. ఈ పథకం ద్వారా పరిసరప్రాంతాల్లోని ఎత్తుప్రాంతంలో ఉన్న సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది.
– నరసింహారెడ్డి, రైతు నందవరం

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఇప్పటికైనా ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంత రైతులు ఏళ్లతరబడి ఎదురు చూపులు చూస్తున్నారు. ఎస్ఆర్బీసీ ఉన్నప్పటికీ సాగునీటి సౌకర్యం లేదు. ఎత్తిపోతల పథకం ఏర్పాటైతే మెట్టభూములు మాగాణి అవుతాయి.
– రవీంద్రనాథ్‌రెడ్డి, రైతు పండ్లాపురం

ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు కృషి



సోములవాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు తమవంతు కృషి చేస్తాం. వాగు ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తాం. రైతులతోనూ మాట్లాడి అవసరమైన చర్యలు చేపడుతాం. గతంలో పంపిన ప్రతిపాదనలు తెలియదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెలియజేస్తాం.
– రఘురామ్, ఏఈఈ మైనర్ ఇరిగేషన్ బనగానపల్లె మండలం

'పది' పరీక్షలకు అధికారుల నియామకం

కొలిమిగుండ్ల: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారుల నియామకం పూర్తయినట్లు ఎంఈఓ జిలానీ బాషా శుక్రవారం తెలిపారు.మండల వ్యాప్తంగా 487 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొలిమిగుండ్ల సెంటర్‌లో చీఫ్ సూపరింటెండ్‌గా పాఠశాల హెచ్ఎం సోమశేఖర్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకుచెందిన బాలసుబ్బారెడ్డిని ఉన్నతాధికారులు నియమించారన్నారు. మోడల్ స్కూల్ సెంటర్‌కు చీఫ్‌గా చంద్రసేనారెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గాఅంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, అంకిరెడ్డిపల్లె సెంటర్‌కు చీఫ్‌గా పెట్నికోట ఉన్నత పాఠశాలకు చెందిన ప్రభాకర్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా సంజామలకు చెందిన నాగరాజును నియమించారని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో మరో రెండు రోజులు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని టౌన్ సబ్ స్టేషన్, వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల నేపథ్యంలో శని, ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. మల్లెంపల్లె, లక్ష్మంపల్లె, బొంతిరాళ్ల గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయానికి ఇచ్చే 9గంటల కరెంటు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. అదేవిధంగా శనివారం పట్టణంలో మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయాభివృద్ధికి విరాళం


నగదు అందజేస్తున్న దాత కృష్ణవేణమ్మ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రేగటి రామకృష్ణా రెడ్డి సతీమణి కృష్ణవేణమ్మ రూ.50,500 విరాళం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్‌కు ఆమె నగదు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను దాతకు అర్చకులు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలోని జంగాలపేటలో సుమారు రూ. 23 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, నిరంజన్, రామనాయుడు, శ్రీను, మధు సూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట

కోవెలకుంట్ల: 2023–24 ఆర్థిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గిరిజన సంక్షేమ పథకాల కోసం రూ. 6,928 కోట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. అన్ని వర్గాలతో పాటు గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కోవెలకుంట్ల: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కొన్నేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపేటర్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంప్యూటర్ ఆపరేటర్లు ఏళ్లతరబడి చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ముత్యాల నాయుడుకు ఇటీవల వినతిపత్రాలు అందజేశామని, ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఆసరా మూడో విడత జాబితా విడుదల

అవుకు: మండల కేంద్రంలోని అవుకు–1 సచివాలయంలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత లబ్ధిదారుల జాబితాను శుక్రవారం ఏపీఎం విజయగోపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుకు మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 573 పొదుపు సంఘాలలోని 5743 మందికి రూ.3.42 కోట్లు లబ్ధిచేకూరిందన్నారు. ఈనెల 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా బటన్ నొక్కి పొదుపు మహిళల ఖాతాలో నగదు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సీసీలు జయమ్మ, రవి, భీమేష్, ఓబులేసు, వీఓఏలు పాల్గొన్నారు.

కత్తితో దాడి దారుణం

డోన్ రూరల్ : కాకినాడ పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావుపై కత్తితో దాడి చేయడం దారుణమని ఆర్టీఓ క్రాంతికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓతోపాటు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా వాహనాలు తనిఖీ చేస్తున్న చిన్నారావుపై దాడికి పాల్పడిన కొబ్బరి బొండాలు అమ్మే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధ్రుతం చేస్తామన్నారు.

ఎస్‌బీఐ లైఫ్ డోన్ బ్రాంచ్ ప్రారంభం

డోన్ టౌన్: పట్టణంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ డోన్ బ్రాంచ్‌ని శుక్రవారం ప్రారంభించారు. గాంధీనగర్‌లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌పై ఆ సంస్థ ఏపీ రీజనల్ డైరెక్టరు గణేష్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సురేష్, డివిజనల్ మేనేజర్ తిరుమలేషుబాబు, డోన్ బ్రాంచ్ మేనేజర్ రామాంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలలతో పాటు ఎస్‌బీఐ లైఫ్ బీమా దారులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని గణేష్ తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బనగానపల్లెరూరల్: హెచ్ఐవీ బాధితులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని బనగానపల్లె ఏరియా వైద్యశాల రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీషా సూచించారు. స్థానిక వైద్యశాలలో కర్నూలు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో స్టిగ్మా, రిడాక్షన్ అవగాహన కార్యక్రమం జరిగింది. శిరీషా మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు మంచి ఆహారం తీసుకుంటే అవకాశవాద రోగాలు రాకుండా చూసుకోవచ్చన్నారు. అనంతరం 25 మంది హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని వైద్యశాల సూరింటెండెంట్ డాక్టర్ సుజాతతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేస్తం నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, డీఆర్పీ నాగరాజు, ఐసీటీసీ కౌన్సిలర్ విజయలక్ష్మీ, లింక్ వర్కర్ కృష్ణ వేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటల నమోదు జాబితా ప్రదర్శన

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో రబీ పంటల సాగు నమోదు జాబితాను ప్రదర్శనగా ఉంచినట్లు ఏఓ కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. పంటల నమోదులో ఎక్కడైనా తప్పులు ఉంటే రైతులు సమీప ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. గోరుమానుకొండ, ఆర్ కొత్తపల్లె గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్స్ సురేష్, రవితేజ పంటల జాబితాను రైతుల సమక్షంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల కథా సంకలనానికి ప్రతిభా పురస్కారం


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం తొగట సురేష్‌బాబు, ఉపాధ్యాయులు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రచించిన 'వెలుతురు చినుకులు' అనే కథల సంకలనానికి ప్రతిభా పురస్కారం లభించినట్లు హెచ్ఎం తొగట సురేశ్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఈ మేరకు ప్రతిభా పురస్కారానికి ఎంపికైన విద్యార్థులు తులసి, స్వాతిక తదితరులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాలామణి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు వారు తమ విద్యార్థులను బాల ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత కుమారి, గోపాల్, సునీల్, జ్యోతి, ప్రేమ్‌కుమార్, లక్ష్మానాయక్, శేషయ్య, సుజాత, జీవలత, ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహానికి చార్జింగ్ లైట్లు


చార్జింగ్ లైట్లను వసతి గృహం అధికారికి అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: కొండపేటలోని బీసీ బాలుర వసతి గృహానికి డోన్ ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శైలజ చార్జింగ్ లైట్లను శుక్రవారం వసతి గృహం అధికారి మధుకు అందజేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ కోతలతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండ న్యాయవాది నాగభూషణంరెడ్డి, శైలజ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి పుట్టిన రోజును పురష్కరించుకొని ఈ లైట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఉపాధ్యక్షురాలు షాలిని, మాజీ అధ్యక్షురాలు పద్మజ, సభ్యులు పద్మ, ఝాన్సీ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలి కుంటు నివారణకు టీకాలు

డోన్ టౌన్: మండలంలోని వెంకటాపురం గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలు వేయనున్నట్లు వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు శుక్రవారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి పశువులకు టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే సహకారంతో లింగంబోడు అభివృద్ధి


శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

అవుకు : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో లింగంబోడు గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి తెలిపారు. లింగంబోడు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ రూ. రూ.10లక్షలతో చేపట్టిన శ్రీరాముల నూతన ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే లింగంబోడు గ్రామాభివృద్ధిపై ప్రత్యే దృష్టి సారించారని, రూ.కోటితో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతోపాటు రైతులు పొలాలకు వెళ్లే రస్తాలను ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. మరోమూడు నెలల్లో ఆలయ నిర్మాణంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తిమ్మారెడ్డి, మద్దిలేటిస్వామి, పుల్లారెడ్డి, కేశాలు, రమణయ్య, సంజీవుడు, బాలన్న, పుల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.1.05లక్షల ఆదాయం


డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సమక్షంలో వాహనాల వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

అవుకు: మండల కేంద్రం అవుకు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నిర్వహించిన వేలంపాటలో రూ.1.05లక్షలు ఆదాయం వచ్చిందని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 13 మోటార్ సైకిల్స్, కారు, ఆటోకు వేలం నిర్వహించామన్నారు. 13 వాహనాలకు జీఎస్టీతో కలిపి రూ.1,05,080 ఆదాయం వచ్చిందని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ మద్దయ్య, ప్రసాద్ రావు, కానిస్టేబుల్స్ నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1,56,520 ఆదాయం

బనగానపల్లెరూరల్: స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాల బహిరంగవేలం పాట ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీతో కలిపి రూ. 1,56,520 ఆదాయం వచ్చింది. శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సమక్షంలో సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామిరెడ్డి ద్విచక్ర వాహనాలు 14, రెండు ఆటోలు, ఒక కారుకు వేలంపాట నిర్వహించారు.

అకాల వర్షం... అపార నష్టం



తమ్మడపల్లె గ్రామ సమీపంలో నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, పొట్టిపాడు వద్ద వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె: అకాల వర్షం రైతు పంట నష్టం చేకూర్చింది. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. గురువారం వడగండ్లతో కూడిన భారీ వర్షానికి మొక్కజొన్న నేలకు వాలింది. మండలంలోని తమ్మడపల్లె, నిలువుగుండ్ల, జంబులదిన్నె, రాళ్లకొత్తూరు, పాతపాడు తదితర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. మరో 40 ఎకరాల్లో వరి పంటకు కూడ నష్టంవాటిల్లిందన్నరు. అదేవిధంగా కల్లాలో ఆరబోసిన మిరప దిగుబడులు తడిసిపోయాయి.

3,469 హెక్టార్లలో పంటనష్టం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మండలాల్లో అకాల వర్షంతో 3,469 హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో అకాల వర్షంతో దెబ్బతిన్న మిరప, మినుము, వరి, పంటలను శుక్రవారం ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి, ఏఓలు నిరంజన్, సుధాకర్‌రెడ్డి, తమ సిబ్బంది కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోవెలకుంట్ల మండలంలో 1,197 హెక్టార్లలో, ఉయ్యాలవాడ మండలంలో 1,230, సంజామల మండలంలో 725, దొర్నిపాడు మండలంలో 316 హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు ప్రాథమిక నివేదికలను ప్రభుత్వానికి పంపారు.


కమ్మవారిపల్లెలో మిరప దిగుబడులపై పట్టాలు కప్పిన దృశ్యం


అక్కంపల్లె సమీపంలో నేలవాలిన మొక్కజొన్న

ముంచెత్తిన వాన

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి వడగండ్ల వర్షం ముంచెత్తింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. అకాల వర్షంతో మండలంలోని నొస్సం, అక్కంపల్లె, సంజామల, ముక్కమల్ల, ఆకుమల్ల, తదితర గ్రామాల్లో మిరప, వరి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో 725 హెక్టార్లలో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

కలవరపెడుతున్న అకాల వర్షం

కొలిమిగుండ్ల: మండు వేసవిలో వర్షం అన్నదాతను కలవరపెడుతుంది. శుక్రవారం తెల్లవారు జామున మండలంలో ఉరుములు, మెరుపులతో మోస్తారు వర్షం కురిసింది. కమ్మవారిపల్లె, పెద్ద వెంతుర్ల, చింతలాయిపల్లె, బిఉప్పలూరు, తిమ్మనాయినపేట తదితర గ్రామాల్లో ఆరబోసిన మిరప, పసుపు దిగుబడులు తడువకుండా కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. మండలంలో 10.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మహిళకు గాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సునీత మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి బిందెతో మంచినీటిని తీసుకెళ్తుండగా అమడాల గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆమెకు కుడికాలు విరిగింది. 108 అంబులెన్స్‌లో ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

డోన్‌లో వ్యక్తికి...

డోన్ రూరల్ : పట్టణం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం రెండుకార్లు ఢీకొనడంతో డోన్ పట్టణానికి చెందిన శేఖర్‌కు గాయాలు అయ్యాయి...స్థానికులు తెలిపిన వివరాల మేరకు శేఖర్ సొంత పనినిమిత్తం కర్నూలుకు కారు బయలుదేరగా హైదరాబాద్ నుంచి బెంగూరుకు వెళ్తున్న మరోకారు ఢీకొంది. గాయాలకు గురైన శేఖర్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.

యువకుడికి పాముకాటు

కోవెలకుంట్ల: స్థానిక సుంకులమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న ఓ యువకుడిని పాము కాటు వేసింది. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో ముళ్ల పొదల్లో నుంచి వచ్చిన పాము కాలనీకి చెందిన బాలకృష్ణ అనే యువకుడిని కాటు వేయడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల: మండలపరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో కర్నాటక అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. శ్రీనివాసులు రెడ్డి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఒరిజనల్ చాయిస్ 24 ఫుల్ బాటిల్స్, 180 ఎంఎల్ 27 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభరాజములు

డోన్ టౌన్ : మండల పరిధిలొని వెంకటాపురం గ్రామంలో నంది విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురష్కరించుకుని శుక్రవారం నిర్వహించిన వృషభరాజముల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. యువత ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం జిల్లా నుంచి మొత్తం 14 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి స్థానంలో ఆనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన ఆదినారాయణ వృషభరాజులు, రెండవ స్థానంలో పాణ్యం మండలం సుబ్బరాయునికొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి ఎద్దులు కై వసం చేసుకున్నాయి. అదేవిధంగా మూడవ స్థానంలో ప్యాపిలి మండలం డి.రంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, నాల్గవ స్థానంలో కోడుమూరు మండలం వలుకూరు గ్రామం రామచంద్ర వృషభాలు, ఐదవ స్థానంలో తుగ్గలి మండలం మారెళ్ల గ్రామం రమేష్ వృషభరాజంలు విజేతలుగా నిలిచాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు మొదటి బహుమతి రూ.30వేలు కల్లూరు చంద్రోశేఖర్‌రెడ్డి, రెండవ బహుమతి రూ.25వేలు కల్లూరు మధుసూదనరెడ్డి, మూడవ బహుమతి రూ.20వేలు కల్లూరు మహేశ్వరరెడ్డి, నాల్గవ బహుమతి రూ.15 వేలు ముష్టిపల్లె మోహన్‌రెడ్డి, ఐదవ బహుమతి రూ.10వేలు కోట్హాల మనోహర్ రెడ్డి అందజేశారు.

అంగరంగ వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠ


శివలింగం ఎదుట నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం నంది విగ్రహ ప్రతిష్ఠ అంగరంగవైభవంగా జరిగింది. ప్రాచీన కాలం నాటి కోనేటి బావిలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నెల్లూరు జిల్లా విజిలెన్స్ శాఖ అడిషనల్ ఎస్పీ కల్లూరు రాజేశ్వరరెడ్డి, అనకాపల్లి రిటైర్డ్ జిల్లా జడ్జి బెనిక బుద్ధ నాగేంద్రరరావు, కర్నూలు ప్రభుత్వ డాక్టర్ పురుషోత్తంరెడ్డి,హైకోర్టు అడ్వకేట్ తొత్తడి జోష్నా దేవి, గ్రామ సర్పంచ్ రాణి, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.